# చట్టం

సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

నిజామాబాద్
బుధవారం
23.04.2025

సంపుటి : 15 సంచిక: 224
పేజీలు: 4 వెల: రూ. 2

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్




## మహేశ్ బాబుకు ఈడీ నోటీసులు

- సాయి సూర్య డెవలపర్స్, సురానా గ్రూపులపై ఇటీవల ఈడీ దాడులు
- ఈ రెండు సంస్థలకు ప్రచారకర్తగా ఉన్న మహేశ్
- పెట్టుబడులు పెట్టేందుకు ఆయన ప్రభావితం చేశారనే అభియోగంపై నోటీసులు

**చట్టం, హైదరాబాద్:** టాలీవుడ్ స్టార్ హీరో మహేష్ బాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీ చేసింది. తమ ఎదుట విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొంది. గతవారంలో రెండు రోజులపాటు సాయి సూర్య డెవలపర్స్, సురానా గ్రూపులపై ఈడీ దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ సంస్థల ప్రాజెక్టులకు మహేష్ ప్రచార కర్తగా వ్యవహరించారు. వీటి ప్రచారానికి గానూ ఆయన భారీగా పారితోషకం అందుకున్నట్లు సమాచారం. ఇక సాయి సూర్య డెవలపర్స్‌కు చేసిన ప్రచారానికిగానూ రూ.5.9 కోట్లు మహేష్ అందుకున్నారు. ఈ ప్రమోషన్ కింద రూ.2.5 కోట్ల నగదు, రూ.3.4 కోట్లు చెక్ రూపంలో ఆయన అందుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో.. పెట్టుబడులు పెట్టేందుకు ఆయన ఇన్‌ఫ్లుయెన్స్ చేశారనే అభియోగంపై ఈడీ నోటీసులు జారీ చేసింది. తొలుత 27వ తేదీన ఆయన్ని విచారణకు ఈడీ నోటీసులు పంపింది. అయితే.. ఆరోజు ఆదివారం ఉన్న నేపథ్యంలో ఆ మరుసటిరోజు (28వ తేదీన) ఉదయం 11గం. విచారణకు రావాలని కోరింది. సంబంధిత గ్రూపులతో జరిగిన లావాదేవీలపై ఈడీ ఆయన్ని ప్రశ్నించే అవకాశం ఉంది.

## నేను ఈ స్థాయికి రావడానికి మీడియానే కారణం



- యూట్యూబ్ ఛానళ్ల ముసుగులో బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి
- సమాజ హితం కోసం పనిచేసే యూట్యూబ్ ఛానళ్లను కచ్చితంగా ప్రోత్సహించాలి
- బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జర్నలిస్టులకు ఇండ్లు, హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ ఇస్తం
- కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్


**చట్టం, హైదరాబాద్:**

జర్నలిజం అనుభవం లేకున్నా యూట్యూబ్ ఛానళ్ల ముసుగులో ఇష్టానుసారం వ్యక్తిగత దూషణలు చేస్తూ కుటుంబాలపై బురద చల్లుతూ బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వీరివల్ల నిజమైన జర్నలిస్టులకు కూడా చెడ్డపేరు వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టు సంఘాలు, ప్రెస్ క్లబ్ నిర్వాహకులు కూడా ఈ విషయంలో కఠినంగా ఉండాలని కోరారు. అదే సమయంలో ప్రజా సమస్యలపై స్పందిస్తూ సమాజ హితం కోసం పనిచేసే యూట్యూబ్ ఛానళ్లను కచ్చితంగా ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఈ విషయంపై త్వరలోనే ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని చెప్పారు. రాష్ట్రంలో జర్నలిస్టులు తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్న జర్నలిస్టులను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఈసారి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే అని స్పష్టం చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జర్నలిస్టులందరికీ ఇండ్లు నిర్మించడంతోపాటు హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతోపాటు సమాజంలో జర్నలిస్టులు గౌరవప్రదంగా జీవించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సోమవారం వేములవాడకు వచ్చిన బండి సంజయ్ స్థానిక ప్రెస్ క్లబ్(ఐజేయూ)ను సందర్శించారు. ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి గతంలో రూ.10 లక్షల మేరకు ఎంపీ లాడ్స్ నిధులను మంజూరు చేశారు. ఆ నిధులతోపాటు దాతల సాయంతో నిర్మిస్తున్న ప్రెస్ క్లబ్ నూతన భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాను ఈ స్థాయికి రావడానికి కారణం మీడియానే అని అన్నారు. ప్రజల కోసం తాను చేసిన ఉద్యమాలను, కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం వల్లనే నాకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పేరు వచ్చింది. మీడియా సహకారం లేకపోతే నేను కరీంనగర్‌కే పరిమితమయ్యేవాడిని. గత ఐదేళ్లలో బీజేపీ అనేక ఉద్యమాలు చేసిందన్నారు.

## సిటీ ప్రశాంతంగా ఉండాలంటే బీజేపీ ఎమ్మెల్సీని గెలిపించాలి

- ఓటు వేసే ముందు ఓటర్లు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి
- మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్

**చట్టం, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో శాంతి భద్రతలు నెలకొని ప్రశాంతంగా ఉండాలంటే ఒకే ఒక పని.. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. సోమవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఈటల.. నరేంద్ర మోదీ ప్రధానమంత్రి కాకముందు హైదరాబాద్‌తో సహా దేశంలోని పలు ప్రాంతాల్లో ఉగ్రవాదులు బాంబు దాడులకు పాల్పడ్డారని.. కానీ మోదీ పాలనలో దేశంవైపు కన్నెత్తి చూసేందుకు కూడా ఉగ్రవాదులు భయపడుతున్నారని చెప్పుకొచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో నగరాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని.. భారతదేశం ఇతర దేశాలతో బలమైన సంబంధాలను కొనసాగిస్తోందని ఈటల రాజేందర్ పేర్కొన్నారు.






# టూరిస్టులపై ఉగ్రదాడి

## పహల్గాంలో పర్యటకులే లక్ష్యంగా టెర్రరిస్టుల కాల్పులు

- 30 మందికిపైగా మృతి.. 20 మంది పరిస్థితి విషమం
- అనంత్‌నాగ్ జిల్లా బైసరన్ ప్రాంతంలో దారుణ ఘటన
- పేరు, మతం పేరు అడిగి మరి కాల్పులు జరిపిన ఉగ్రవాదులు
- సైనిక దుస్తుల్లో వచ్చి మారణహోమానికి పాల్పడిన ఏడుగురు ఉగ్రవాదులు
- అమర్‌నాథ్ యాత్ర వేళ ఉలిక్కిపడ్డ భారతావని
- సౌదీ పర్యటనలో ఉన్న ప్రధాని దాడి ఘటనపై దిగ్భ్రాంతి
- ఏ ఒక్కరిని కూడా వదిలిపెట్టబోమని హెచ్చరిక
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు ఫోన్ చేసిన ప్రధాని
- వెంటనే బయలుదేరి కశ్మీర్ కు వెళ్లిన హోంమంత్రి
- అత్యున్నత స్థాయి భద్రతా సమీక్ష నిర్వహించిన షా
- ఉగ్రవాదుల కోసం కొనసాగుతున్న వేట



**శ్రీనగర్:**

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి పేట్రేగిపోయారు. అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలో పర్యటకులే లక్ష్యంగా దాడులకు తెగబడ్డారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరన్ ప్రాంతంలో విహారానికి వచ్చిన వారిపై పాశవిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 30 మందికి పైగా పర్యటకులు ప్రాణాలు కోల్పోగా.. మరో 20 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో జమ్మూకశ్మీర్‌లో అతి పెద్ద ఉగ్ర ఘటన ఇదేనని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో బైసరన్ ప్రాంతంలో ఉన్న దాదాపు 40 మంది పర్యటకులను అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఉగ్రవాదులు ఒక్కసారిగా చుట్టుముట్టారు. అనంతరం విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డారు. దీంతో కొంతమంది అక్కడికక్కడే కుప్పకూలగా.. అనేక మంది తీవ్ర గాయాలపాలయ్యారు. రక్తపు మడుగులో పడి ఉన్న మృతదేహాలతో స్థానికంగా భీతావహ వాతావరణం నెలకొంది. తమ వారిని కాపాడాలంటూ పలువురు విజ్ఞప్తి చేస్తున్న దృశ్యాలు బయటకు వచ్చాయి. ఈ ప్రాంతానికి కేవలం కాలినడకన లేదా గుర్రాలపై మాత్రమే చేరుకునే అవకాశం ఉండటంతో బాధితులను తరలించడం కష్టమైంది.

**గుర్రాల సాయంతో..**


బైసరన్‌లో కాల్పుల శబ్దం వినిపించడంతో వెంటనే అప్రమత్తమైన భద్రతా బలగాలు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి తరలివెళ్లాయి. గాయపడిన వారిని హెలికాప్టర్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే స్థానికులు గుర్రాల సాయంతో పలువురిని తీసుకెళ్లినట్లు సమాచారం. తొలుత మృతుల సంఖ్య తక్కువగానే ఉన్నట్లు పేర్కొన్నప్పటికీ.. ఆ తర్వాత క్రమంగా పెరిగింది. గాయపడిన వారిలో మరికొందరి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు.. కాల్పుల ఘటనతో పహల్గాం వీధులు నిర్మానుష్యంగా మారాయి. పర్యటకులు సైతం సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లినట్లు తెలిసింది.

**అమర్‌నాథ్ యాత్ర వేళ..**

38 రోజుల పాటు కొనసాగే అమర్‌నాథ్ యాత్ర జులై 3 నుంచి ప్రారంభం కానుంది. దేశవ్యాప్తంగా లక్షల మంది యాత్రికులు రెండు మార్గాల్లో ఇక్కడకు చేరుకుంటారు. అనంత్‌నాగ్ జిల్లాలో పహల్గాం మార్గంలోనే 48 కి.మీ మేర ఉండగా..14 కి.మీ మార్గం గండేర్బల్ జిల్లా నుంచి ఉంటుంది. ఈ నేపథ్యంలో పర్యటకులపై ఉగ్రవాదులు దాడికి తెగబడటం ఆందోళన కలిగిస్తోంది.



"పర్యటకులపై ఉగ్రదాడి హేయనీయం. ఈ దురాగతానికి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెడతాం. ఎవరినీ విడిచిపెట్టే ప్రసకే లేదు. ఉగ్రవాదంపై పోరాటానికి భారత్ కృతనిశ్చయాన్ని ఇలాంటి దుష్టశక్తుల పన్నాగాలు నీరుగార్చలేవు. పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపం. బాధితులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను"
- నరేంద్ర మోదీ, దేశ ప్రధాని




'పర్యటకులపై దాడి నన్ను తీవ్రంగా బాధించింది. ఈ దురాగతానికి పాల్పడిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఇందులో ఇన్వాల్వ్ అయిన టెర్రరిస్టులపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటాం. ఘటన గురించి ప్రధాని మోదీకి వివరించాను. సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించాను"
- అమిత్ షా, కేంద్ర హోంశాఖ మంత్రి



"అమాయక టూరిస్టులపై జరిగిన ఉగ్రదాడి నన్ను తీవ్ర వేదనకు గురిచేసింది. ఇది పిరికిపంద, అమానవీయ క్రూరమైన చర్య. ఈ ఘటనలో బాధ్యులను వదిలిపెట్టబోమం. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేస్తున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నాను. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశం ఐక్యంగా ఉంది"
- కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రి

## పెద్దపేగు క్యాన్సర్ తో జాగ్రత్త


- 45 ఏళ్లు దాటినవారు కొలనోస్కోపీ స్క్రీనింగ్ చేయించుకోవాలి
- వేగంగా వ్యాప్తి చెందుతున్న వాటిలో కొలొరెక్టల్ క్యాన్సర్ ఒకటి
- కాంటినెంటల్ హాస్పిటల్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ గురు ఎన్. రెడ్డి వెల్లడి



**చట్టం, హైదరాబాద్:** మన దేశంలో పెద్దపేగు(కొలొరెక్టల్) క్యాన్సర్ బారిన పడే వారి సంఖ్య పెరుగుతోందని.. 45 ఏళ్లు దాటిన వారు తప్పనిసరిగా కొలనోస్కోపీ స్క్రీనింగ్ చేయించుకోవాలని కాంటినెంటల్ హాస్పిటల్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ గురు ఎన్. రెడ్డి సూచించారు.ఇది ప్రపంచంలో మూడో అత్యంత సాధారణ క్యాన్సర్ గా ఉందని ఆయన తెలిపారు. దాదాపు 10 శాతం కేసులకు కారణ మవుతుందన్నారు. మంగళవారం గచ్చిబౌలిలోని కాంటినెంటల్ హాస్పిటల్ లో కొలొరెక్టల్ క్యాన్సర్ కు సంబంధించి అవగాహన కార్యక్రమం జరగగా.. డాక్టర్ గురు ఎన్. రెడ్డి పాల్గొని మాట్లాడారు. కొలొరెక్టల్ అనేది క్యాన్సర్ సంబంధిత మరణాల్లో రెండో ప్రధాన కారణంగా ఉందన్నారు. మన దేశంలో మిజోరాం,జమ్మూ కశ్మీర్ రాష్ట్రాలతో పాటు కేరళలోని కొల్లాం, తిరువనంతపురం, బెంగళూరులోనూ ఈ వ్యాధి రేటు ఎక్కువగా ఉందన్నారు. దేశంలో ఈ క్యాన్సర్ వ్యాప్తి 20% నుండి 124% వరకు పెరుగుతున్నట్టు కొన్ని రిజిస్ట్రీలు పేర్కొంటున్నాయని ఆయన తెలిపారు. కొలొరెక్టల్ క్యాన్సర్ ను గుర్తించేందుకు కొలనోస్కోపీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కాంటినెంటల్ హాస్పిటల్ లో మూడేళ్లుగా ఈ క్యాన్సర్ కు సంబంధించిన మార్గదర్శకాలను అనుసరిస్తూ 2 వేల మందికి ఈ స్క్రీనింగ్ పరీక్షలు చేశామన్నారు. కాంటినెంటల్ హాస్పిటల్స్ చేసిన స్టడీలో పురుషుల్లో 28.03 శాతం, మహిళల్లో 21.15 శాతం మందిలో క్యాన్సర్ కు ముందు గుర్తించే పాలిప్స్ కనుగొనబడ్డాయన్నారు. వీటిని తొలగించకపోతే జీవితకాలంలో క్యాన్సర్ బారిన పడే అవకాశముందన్నారు. ఏసీజీ, అమెరికన్ క్యాన్సర్ సొసైటీ చూపించిన రూల్స్ ప్రకారం.. కొలనోస్కోపీ స్క్రీనింగ్ ద్వారా కొలరెక్టల్ క్యాన్సర్ కేసులను గణనీయంగా తగ్గించవచ్చని.. మరణాలను నివారించవచ్చని డాక్టర్ గురు ఎన్. రెడ్డి తెలిపారు. 2022లో ప్రపంచవ్యాప్తంగా కొలొరెక్టల్ క్యాన్సర్ కేసులు 8,81,984 ఉండగా, భారత్ లో 38,367 మరణాలు నమోదయ్యాయని..ప్రారంభ దశలో ఇది లక్షణాలు లేకుండా ఉండవచ్చన్నారు. తర్వాత దశల్లో లక్షణాలు కనిపించే సమయానికి ట్రీట్ మెంట్ కష్టతరంగా మారొచ్చన్నారు. ముందస్తుగా దీన్ని గుర్తించాలంటే 45 ఏళ్లు దాటిన వారు కొలనొస్కోపీ స్క్రీనింగ్ చేయించుకోవాలని డాక్టర్ గురు ఎన్. రెడ్డి సూచించారు.

## అమెరికా భారత్ ద్వైపాక్షిక ఒప్పందంలో కీలక ముందడుగు

- అంబర్ కోటను సందర్శించిన జేడీ వాన్స్ దంపతులు
- ఇంధనం, వ్యూహాత్మక సాంకేతికతలు, రక్షణ తదితర రంగాల్లో పరస్పర సహకారం



**న్యూఢిల్లీ:** భారత్ అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో కీలక ముందడుగు పడింది. వాణిజ్య చర్చల కోసం రోడ్ మ్యాప్‌ను వివరించే సూచనలు, నిబంధనలపై ఇరు దేశాలు ఓ అంగీకారానికి వచ్చాయి. త్వరలో జరగబోయే చర్చలు ఈ విషయంలో సమతూకం పాటించడానికి దోహదపడతాయని యూఎస్ వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ పేర్కొన్నారు. యూఎస్ వాణిజ్య ప్రతినిధుల కార్యాలయం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో గ్రీర్ మాట్లాడుతూ.. అమెరికా భారత్ వాణిజ్య సంబంధాలలో ఇప్పటివరకు పలు లోపాలు ఉన్నాయని అన్నారు. అమెరికన్ వస్తువులకు కొత్త మార్కెట్లను తెరవడం, ఇక్కడి కార్మికులకు హాని కలిగించే అన్యాయమైన పద్ధతులను తొలగించడం వంటి విషయాలపై ప్రస్తుతం భారత్‌తో చర్చిస్తున్నామన్నారు. అగ్రరాజ్య ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్, ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయిన అనంతరం ఈ ప్రకటన వెలువడింది. ఇరుదేశాల నేతలు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు భారత్, అమెరికా కొనసాగిస్తున్న చర్చల్లో పురోగతిపై సంతృప్తి వ్యక్తంచేశారు. ఇంధనం, వ్యూహాత్మక సాంకేతికతలు, రక్షణ తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంచుకోవడంపై దృష్టిసారించాల్సిన ఆవశ్యకత ఉందని అభిప్రాయం వ్యక్తంచేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఏడాది భారత్‌లో చేపట్టనున్న పర్యటన కోసం తాను ఉత్సాహంగా ఎదురుచూస్తున్నట్లు మోదీ పేర్కొన్నారు.

## 8 రోజుల పర్యటన 12 వేల కోట్ల పెట్టుబడులు

- సీఎం రేవంత్ జపాన్ టూర్ పూర్తి
- రాష్ట్రానికి భారీగా ఇన్వెస్ట్ మెంట్స్
- దాదాపు 3500 మందికి ఉద్యోగావకాశాలు
- చివరి రోజు ప్రసిద్ధ హిరోషిమా శాంతి స్మారకాన్ని, మహాత్మా గాంధీ విగ్రహాన్ని సందర్శించిన సీఎం బృందం



**చట్టం, హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జపాన్ పర్యటన నేటితో(మంగళవారం) ముగిసింది. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకు రావడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రి శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు ఏప్రిల్ 16 నుంచి ఏప్రిల్ 22 వరకు 8 రోజులపాటు జపాన్ లో పర్యటించారు. జపాన్ లోని ఓసాకాలో జరిగిన ఇండస్ట్రియల్ ఎక్స్ పోలో పాల్గొన్న అనంతరం.. వివిధ పారిశ్రామిక వర్గాలతో పలు సమావేశాలు జరిపారు. 8 రోజుల జపాన్ పర్యటనలో సీఎం బృందం తెలంగాణకు రూ. 12,062 కోట్ల పెట్టుబడులను సాధించారు. ఈ భారీ పెట్టుబడులతో రాష్ట్రంలో దాదాపు 3500 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయని అధికారులు పేర్కొన్నారు. కాగా పర్యటనలో చివరి రోజున జపాన్‌లోని ప్రసిద్ధ హిరోషిమా శాంతి స్మారకాన్ని, మహాత్మా గాంధీ విగ్రహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఇక రేపు సీఎం రేవంత్ రెడ్డి బృందం తిరిగి హైదరాబాద్ కు రానున్నారు.

**హిరోషిమా డిప్యూటీ గవర్నర్‌తో భేటీ**

రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డితో పాటు పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు నేతృత్వంలోని తెలంగాణ అధికారుల బృందం హిరోషిమా డిప్యూటీ గవర్నర్‌తో సమావేశమయ్యారు. రెండు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ హిరోషిమా ప్రభుత్వ ఆతిథ్యానికి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. శాంతితో పాటు సాంకేతిక పురోగతిలో హిరోషిమా ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు సాధించిందని అన్నారు. తెలంగాణ కూడా కొత్త ఆవిష్కరణలు, సుస్థిర విధానాలు, శాంతియుత వాతావరణానికి కట్టుబడి ఉందని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, తెలంగాణ, హిరోషిమా కలిసి పని చేయగలిగే రంగాలపై విస్తృతంగా చర్చలు జరిపారు. వ్యర్థాల నుంచి ఇంధనం లాంటి క్లీన్ టెక్నాలజీ, మున్సిపాలిటీల్లో వ్యర్థాల ప్రాసెసింగ్, మురుగు నీటి శుద్ధి, పునరుత్పాదక విద్యుత్తు ప్రాజెక్టులు, అర్బన్ ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హైదరాబాద్లో విపత్తుల నివారణ డిజైన్లు, భూగర్భ మెట్రో ఇంజనీరింగ్, స్మార్ట్ సిటీ సొల్యూషన్స్, పారిశ్రామిక సహకారం, ఎలక్ట్రిక్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్, అధునాతన ఉత్పత్తుల తయారీకి హిరోషిమాతెలంగాణ ఆటోమోటివ్ అండ్ మొబిలిటీ కారిడార్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలను ప్రస్తావించారు.

CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

సంపాదకీయం

## రాజీవ్ యువవికాసం పథకం
# రుణాలు పరిమితి పెంచాలి

**చట్టం రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :**



రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రాజీవ్ యువవికాసం పథకం పేరుతో సబ్సిడీ రుణాలను ఇచ్చేందుకు ముందుకు వచ్చి బడుగు బలహీన వర్గాలకు చెందిన ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ, బీసీ, ఈబీసీ తదితర వర్గాలనుండి ధరఖాస్తులు తీసుకుంటుండడాన్ని బీసీ సాధికారిత సంఘం హర్షించుచుండెనని నరేందర్ అన్నారు.ఇట్టి రాజీవ్ యువవికాసం పథకం ద్వార అత్యంత వెనుకబడిన వర్గాలవారికి స్వయం ఉపాధికి ఇచ్చే సబ్సిడీ రుణం రూ.4 లక్షలు కులవృత్తికి సంబంధించిన మిషనరీల కొనుగోలుకు ఏమాత్రం సరిపోనందున సబ్సిడీ రుణాలను మరింత పెంచాలని ,కులాల వారిగా అన్ని కులాలకు ఆర్థిక కార్పొరేషన్లు ఉన్నచో,అట్టి కార్పొరేషన్ల ద్వార గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు సబ్సిడీ ద్వార రుణం తీసుకోవచ్చునని ,గత అసెంబ్లీ ఎన్నికల్లో కార్పొరేషన్ల ద్వార అత్యంత వెనుకబడిన వర్గాలకు కార్పొరేషన్లను ఏర్పాటు చేసి అట్టి కార్పొరేషన్ల ద్వార యువతకు రూ.10 లక్షల వరకు పూచీకత్తు లేకుండా , వడ్డీ లేని రుణాలను అందిస్తామని కామారెడ్డి సభలో సీఎం గారు ప్రకటించిన విషయాన్ని నరేందర్ గుర్తు చేశారు. రాష్ట్ర గవర్నర్ గారి ఆమోదంతో కేంద్రానికి పంపిన బీసీ రిజర్వేషన్ బిల్లులు చట్టబద్ధంగా ,శాస్త్రీయంగా ఆమోదం పొందాలని గత 20 రోజులనుండి డిల్లీలో ఆమరణ నిరహార దీక్ష చేపట్టిన బీసీ హిందూ మహాసభ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్ గారి ఆరోగ్య పరిస్తితి విషమించకమిందే కేంద్ర మంత్రి వర్యులు కిషన్ రెడ్డి,బండి సంజయ్ గార్లు హామీ ఇచ్చి దీక్షను విరమింప జేయాలని కేంద్ర మంత్రులకు పొలాస నరేందర్ విజ్ఞప్తి చేశారు. అత్యంత వెనుకబడిన వర్గాలయిన ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ ,బీసీ , ఈబీసీ కులాలకు చెందిన కులవృత్తులకు ఆదరణ, ఆర్థిక సహాయం కరువై రోజు రోజుకు కుల చేతి వృత్తులు కనుమరుగై, ఉపాధి కోల్పోయి జీవనోపాధి కష్టంగా మారి బ్రతుకే బరువై కొన్ని కుటుంబాలు గల్ఫ్ దేశాలకు వెళ్ళుచున్నారని, మరి కొన్ని కుటుంబాలు దిక్కు తోచక ఉపాధి లేక చిన్న చిన్న కుటుంబాల బ్రతుకులు చితికి పోతున్నాయని ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘం అధ్యక్షులు పొలాస నరేందర్ అన్నారు. అట్టడుగు బడుగు బలహీన వర్గాలకు చెందిన బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీల కుల వృత్తులు యధావిధిగా కొనసాగుటకు ,అంతరించిపోతున్న వివిధ కులాల కుల చేతి వృత్తులకు పూర్వ వైభవం వచ్చుటకు,గతంలో మాదిరిగా కుల చేతి వృత్తులు చేసుకుంటూ దర్జాగా జీవనాన్ని సాగించుటకు గాను కులాల వారీగా ఆర్థిక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటికి తగినన్ని నిధులు కేటాయించాలని,గతంలో మంజూరు చేసిన ఫెడరేషన్లను ఆర్థిక కార్పొరేషన్లు గా మార్చాలని,కార్పొరేషన్లకు విధి విధానాలను నిర్ణయించి, పాలక మండల్లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని నరేందర్ కోరారు.

# తడ్కల్‌లో భూ భారతి అవగాహన సదస్సు...

- భూ భారతితో రైతుల భూ సమస్యలకు సత్వర పరిష్కారం..
- జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**చట్టం నారాయణ ఖేడ్ ప్రతినిధి :**



సంగారెడ్డి జిల్లా నారాయణ ఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండల పరిధిలోని తడ్కల్ దేవి ఫంక్షన్ హాల్ లో భూభారతి అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, అదనపు కలెక్టర్ ఆర్ డి మాదురి నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్టోళ్ళ సంజీవరెడ్డి,తో కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న భూ భారతి పోర్టల్ చట్టాన్ని రైతు సహోదరులకు అవగాహన కల్పించారు. భూ భారతితో రైతుల భూ సమస్యలకు సత్వరమే పరిష్కారం లభిస్తుందని ,రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఆర్ఓఆర్ - 2025 చట్టంతో ఎంతోమంది రైతులకు మేలు చేకూరనుందని అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఎన్నోఏళ్లుగా భూ సమస్యల పరిష్కారానికై, అధికారుల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరుగుతూ డబ్బులు, సమయాన్ని వృధా చేసుకోవడమే తప్ప సమస్యల పరిష్కారం కాక రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం భూ భారతి చట్టం ద్వారా రైతులకు చేకూరే ప్రయోజనాలను కలెక్టర్ ఒక్కో అంశంపై దృశ్య రూపకంగా వివరించారు. భూ సమస్యలు కలిగిన రైతులు చట్టం అమల్లోకి వచ్చిన ఏడాది కాలంలోపు భూభారతి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భూమి సమస్యలకై ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఉండాలని 18 రాష్ట్రాలలో సర్వే చేసి అక్కడ ఉన్న సమస్యలు మన దగ్గర ఉండద్దని పకడ్బందిగా ఈ పోర్టల్ ప్రారంభించటం జరిగింది. భూ భారతి చట్టం ప్రకారం భూ సంబంధిత సమస్యను బట్టి తహశీల్దార్,రెవెన్యూ డివిజన్ అధికారి రెండు అంచెలలో వ్యవస్థతో నిర్దిష్ట గడువులోపు పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. సమస్య పరిష్కారం కాకుంటే కొత్తగా ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్ ను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని పేర్కొన్నారు. అనంతరం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కారాని కై భూభారతి పోర్టల్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయం సరైంది కాదని భావిస్తే కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయం పై అభ్యంతరం ఉంటే ల్యాండ్ ట్రిబ్యునల్ కు అప్పీల్ చేసుకోవచ్చని అన్నారు. గ్రామంలో రెవెన్యూ రికార్డులు తయారు చేసి,ప్రతి సంవత్సరం డిజిటల్ రూపంలో పొందుతారన్నారు. ప్రతి గ్రామానికి విలేజ్ లెవెల్ ఆఫీసర్లను నియమించనున్నట్లు, మనిషికి ఆధార్ లాగే ప్రతి రైతుకు భూధార్ కార్డు ఇవ్వడంతో పాటు రైతుకు సంబంధించిన వ్యవసాయ భూమికి నక్ష రూపంలో పట్టాదార్ పాస్ పుస్తకం జారీ చేయనున్నట్లు తెలిపారు. పెండింగ్ లో ఉన్న సాదా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. వీటికి సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు వెలువడనున్నాయని అన్నారు. భూ భారతి పోర్టల్ తెలంగాణలో కొత్త రెవెన్యూ చట్టం అమల్లోకి వచ్చింది.భూ భారతి చట్టంతో పాటు భూ భారతి పోర్టల్ కూడా ప్రారంభమైంది. భూముల నిర్వహణతో పాటు రిజిస్ట్రేషన్ల వంటి అంశాలన్నీ కూడా భూ భారతి పోర్టల్ ఆధారంగానే జరగనున్నాయి. ఏప్రిల్ 14వ తేదీ నుంచి భూ భారతి సేవలు అందుబాటులోకి వచ్చిందని అన్నారు. కొత్తగా వచ్చిన ఈ పోర్టల్ లో లావాదేవీ సేవలతో పాటు, సమాచార సేవలు ఉన్నాయి. లావాదేవీల విభాగంలో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, ఆర్ఓఆర్ కరెక్షన్, నాలా, అప్పీల్, భూముల వివరాలతో పాటు ఇతర సేవలు అందుబాటులో ఉన్నాయి అన్నారు. ఇక సమాచార సేవల్లో చూస్తే భూముల వివరాలు, భూముల మార్కెట్ విలువ, నిషేధిత భూములు, ఈ చలాన్ అప్లికేషన్ స్టేటస్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ వివరాలను తెలుసుకునే సేవలు అందుబాటులో ఉండేలా రూపకల్పన చేశారని అన్నారు. భూముల వివరాలు ఎలా చెక్ చేసుకోవాలో ఇక్కడ తెలుసుకోండి..భూ వివరాలను ఇలా చెక్ చేసుకోండి: భూమి వివరాలు తెలుసుకునేందుకు ముందుగా భూ భారతి అధికారిక పోర్టల్ లోకి వెళ్లాలి.హోం పేజీలో కనిపించే సమాచార సేవల్లోకి వెళ్లాలి.ఇక్కడ భూ వివరాలు అనే ఆప్షన్ ఉంటుంది.

**భూ వివరాల ఆప్షన్ పై క్లిక్ చేస్తే మరో పేజీ ఓపెన్ అవుతుంది.**

ఇక్కడ సర్వే నెంబర్ లేదా పట్టాదారు పాస్ ఆధారంగా మీ భూమి వివరాలను తెలుసుకోవచ్చు. సర్వే నెంబర్ తో చూసుకోవాలనుకుంటే జిల్లా, మండలం, గ్రామం ఎంచుకోని చెక్ చేసుకోవచ్చు. పట్టాదారుపాస్ పుస్తకంతో అయితే కేవలం పాస్ పుస్తకం నెంబర్ తో పాటు కింద ఉండే కోడ్ ను ఎంటర్ చేసి తెలుసుకోవచ్చు. ప్రింట్ ద్వారా భూ వివరాల కాపీని పొందవచ్చు. ఈ లింక్ పై క్లిక్ చేసి భూ వివరాలను నేరుగా తెలుసుకోవచ్చు అని అన్నారు. ఇక భూ భారతి చట్టం ప్రకారం భూమి యజమాని రూ. 300 రూపాయలు చెల్లించి దరఖాస్తు చేస్తే పట్టాదారు పాసుపుస్తకం జారీ అవుతుంది. మ్యూటేషన్ దరఖాస్తు కోసం ఎకరానికి రూ. 2500 చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్క ప్రకారం గుంటకు రూ. 62.50 ఛార్జీ పడుతుంది. భూ హక్కులతో పాటు అధికారుల సమర్పించిన రికార్డుల్లో ఏమైనా తప్పులు ఉంటే అప్పీల్ కు వెళ్లొచ్చు. ఇందుకోసం రూ. 1000 చెల్లించాల్సి ఉంటుంది. భూ యజమాని రికార్డుల్లో తప్పుల సవరణ దరఖాస్తు కోసం రూ. 1000 చెల్లించాలి. స్లాట్ బుకింగ్ ద్వారానే భూ భారతి పోర్టల్ లోనూ రిజిస్ట్రేషన్లు అవుతాయి. అనుకున్న సమయానికి కాకపోతే మార్పులు చేసుకునే వీలు ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు అధికారి శ్రీమతి ఆర్ డి మాధురి, నారాయణఖేడ్ డివిజన్ అధికారి అశోక్ చక్రవర్తి, ఏడిఏ నూతన్ కుమార్, డిఎల్పిఓ సంజీవరావు, తహశీల్దార్ సి భాస్కర్, ఎంపీడీవో సత్తయ్య, మండల వ్యవసాయ అధికారి హరీష్ పవర్, వ్యవసాయ విస్తీర్ణం అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## ఎక్సైజ్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

**చట్టం, బోధన్:** బోధన్ పట్టణంలో ఎక్సైజ్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా ఉమ్మడి ఎక్సైజ్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సబ్ కలెక్టర్, ఏసీపీ, ఎక్సైజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తహేర్ బిన్ హాందన్, గ్రంధాలయ చైర్మన్ అంతి రెడ్డి రాజిరెడ్డి, బోధన్ కాంగ్రెస్ నాయకులు తూము శరత్ రెడ్డి, దాము, నాగేశ్వరరావు, హరికాంత్ చారి, పౌల్, అల్లే రమేష్, సంజీవ్ రెడ్డి, గుండెడి శంకర్, తలారి నవీన్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక చేయూత



**చట్టం, నవీపేట్ :** నందిపేట్ మండలం శాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళా అనారోగ్య కారణంగా మరణించారు. అంత్యక్రియలు చేయడానికి కూడా డబ్బులు లేని పరిస్థితి... ఇలాంటి పరిస్థితి గమనించిన దూపల్లి గ్రామానికి చెందిన కర్రె భాగాన్న అనే యువకుడు తన సంస్థకు సమాచారం అందించారు. స్పందించిన మీ కోసం మేము సేవా సంస్థ 10,000 రూపాయలు అంత్యక్రియల నిర్వహణ కోసం ఆర్థిక సహాయం అందజేశారు.

## విద్య శాఖ మండల వనరుల కేంద్ర భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ధన్ పాల్



**చట్టం నిజామాబాద్ ప్రతినిధి :** గౌతమ్ నగర్ ఓల్డ్ స్నేహ సొసైటీ పక్కన విద్య సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (TGEWIDC) ఆధ్వర్యంలో నిర్మించనున్న మండల వనరుల కేంద్ర భవన నిర్మాణం శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇందూర్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు నిజామాబాదు నార్త్ విద్య శాఖ మండల వనరుల కేంద్ర భవన నిర్మాణం పనులు అంచనా విలువ 40.70 లక్షల వ్యయంతో పనుల ప్రారంభనికి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. భవన నిర్మాణ పనులు నాణ్యతో త్వరతగతిన పూర్తి చేయాలనీ కాంట్రాక్టర్ కి సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో రాబోయే విద్య సంవత్సరానికి విద్యార్థుల సంఖ్య పెరిగేల తల్లి తండ్రుల్లో అవగాహన తీసుకురావాలని జిల్లా విద్య అధికారికి సూచించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకి విద్య శాఖ అధికారులు ఘన స్వాగతం పలికి వారిని సత్కారించారు. ఈ కార్యక్రమం లో DEO అశోక్, MEO వెంకట నారాయణ, AE ఉదయ్ కిరణ్, కాంట్రాక్టర్ యాదగిరీ, అధికారులు ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు, మాయావర్ సాయిరం, రంజిత్, సంతోష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడ్డ బాలుడు.



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని జమ్మన్ జెట్టి గల్లీలో వీధి కుక్కలు స్వైర విహారం చేశాయి. వీధిలో ఆడుకుంటున్న బాలుడి పై వీధి కుక్కలు పైశాచికంగా దాడి చేశాయి. బాలుడికి 5 సంవత్సరంల వయసు, తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో బాలుడిని నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు.

# నెరవేరిన ఎన్నో ఏళ్ల కల

- ఫలించిన విప్ ఆది శ్రీనివాస్ కృషి
- 10 కోట్లతో అగ్రహారం కాలేజ్ కి బాలికల హాస్టల్ మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని అగ్రహారం డిగ్రీ కళాశాలలో బాలికల హాస్టల్ నిర్మాణానికి 10 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఎడ్యుకేషన్ కమిషనర్ ఉత్తర్వుల జారీ చేశారు. కాగ గతంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా కలశాల ప్రిన్సిపాల్, విద్యార్థినీలు కళాశాలలో హాస్టల్ వసతి సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, హాస్టల్ నిర్మాణం చేయవలసిందిగా కోరుతూ వినతి పత్రం అందజేయగా వెంటనే స్పందించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి బాలికల హాస్టల్ నిర్మాణం చేపట్టవాల్సిందిగా కోరగా తక్షణమే స్పందించి హాస్టల్ నిర్మాణం కోసం 10 కొట్లు నిధులు మంజూరు చేయించడం జరిగింది. కాగా బాలికల హాస్టల్ నిర్మాణం కోసం నిధులు మంజూరు కావడం పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## శంకర్ భవన్ పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్**



**చట్టం నిజామాబాద్ ప్రతినిధి :** కోటగల్లి శంకర్ భవన్ పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇందూర్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు కేంద్రప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్య, మౌలిక సదుపాయాల నాణ్యతను మెరుగుపరచడానికి పీఎం శ్రీ పథకం కింద శంకర్ భవన్ పాఠశాల ఎంపిక చేసి గత సంవత్సరం 27 లక్షలు మరియు అటల్ టింకరింగ్ ల్యాబ్ కొరకు 10 లక్షల నిధులు కేటాయించడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి శ్రీ నిధుల ద్వారానే శంకర్ భవన్ పాఠశాల అభివృద్ధి జరుగుతుందని రాష్ట్రంలో ఉత్తమ పాఠశాలగా శంకర్ భవన్ పాఠశాలను తీర్చిదిద్దాలని విద్య శాఖ అధికారులకు సూచించారు. గత ప్రభుత్వం, కాంగ్రెస్ ప్రభుత్వాలు మన ఊరు మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాలలు పథకాలు పేరుకే పరిమితం అవుతున్నాయి తప్పితే ప్రభుత్వ బడులు మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఇందూర్ అర్బన్ నియోజకవర్గంలో పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్య అందించడమే తన లక్ష్యం అని శంకర్ భవన్ పాఠశాల అభివృద్ధికి తన ట్రస్ట్ ద్వారా సహకరిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతు విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల విద్యార్థులతో పోటీ పడి చదవాలని ఉత్తమ ర్యాంకులను సాధించాలని సూచించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడా & యోగ, వివిధ కళ రంగాలలో కూడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. విద్యలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు ప్రోత్సాహకరంగా షిల్డ్ బహుమతులను ఎమ్మెల్యే విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, మండల అధికారి సాయ రెడ్డి, హెడ్ మాస్టర్ రాంచందర్, అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ ఛైర్పర్సన్ గోదావరి, బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ అధికారుల పై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు..

- పంచాయతీ సిబ్బందిపై విద్యుత్ అధికారుల పెత్తనం..
- అతిగా వ్యవహరిస్తున్నారని ఆరోపణ..

**చట్టం ప్రతినిధి కామారెడ్డి:** కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండల్ హాసన్ పల్లి గ్రామంలో గల జామ మస్జిద్ కు గ్రామపంచాయతి నుండి వచ్చే మంచినీళ్ళ నల్ల కనెక్షన్ ను ఎటువంటి ముందస్తు నోటిస్ ఇవ్వకుండా నిలిపివేశారు, దీంతో జామ మజీద్ కమిటీ సభ్యులు ప్రజావాణిలో కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సయ్యద్ అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ సంబంధం లేని డిపార్ట్మెంట్ గ్రామపంచాయతీ సిబ్బందిపై పెత్తనం సాగిస్తున్నారని ఆయన ఆరోపించారు.ఈ జామ మస్జిద్ ను 1962లో తమ పెద్దలు కట్టించడం జరిగిందన్నారు, అప్పట్లో Transco లో పని చేసిన చాలా మంది రిటైర్ అయిన తర్వాత ఎల్లారెడ్డి, భాన్సువాడ ఇతర ఉర్లలో స్థిరపడ్డారని చెప్పారు. ఊల్లో ముస్లింస్ జనభా తక్కువ ఉండటంతో మస్జిద్ ను ఎవరూ పట్టించుకోకపోవడంతో కూలిపోయే స్థితికి వస్తే ఊర్లో ఉన్న అందరూ కలిసి డబ్బులు జమ చేసి మస్జిద్ ను బాగు చేసమన్నారు, మస్జిద్ లో 5 పుటలు నమాజ్ జరగాలనే మంచి ఉద్దేశంతో ఒక ఇమామ్ మరియు మోజాన్ ను నియమించి వారి కుటుంబ సభ్యులతో ఉండే విదంగా సౌకర్యాలు కల్పించి వారికి జీతాలు కూడా ఇస్తున్నామన్నారు, అయితే ఈ నెల 16న హాసన్ పల్లి గ్రామస్థులైన పవన్, సాయి అనే ఇద్దరు వచ్చి మస్జిద్ కు సరఫరా అయ్యే నీళ్ళ పైపు కట్ చేసారని చెప్పారు. ఎందుకు కట్ చేస్తున్నారని అడగగా AD Civil సురేష్ కుమార్, AD శ్రీకాంత్ లు చెప్తే చేస్తున్నామని తెలపడం జరిగిందన్నారు. దింతో ADని ఈ విషయంలో వివరణ కోరగా మాకు Se ఆదేశాల ప్రకారం చేశామని సమాధానం ఇచ్చారని తెలిపారు. ఊర్లో ఆలయాలకు ఇతర వాటికి నల్ల కలెక్షన్లు ఉండగా కేవలం మస్జిద్ నీళ్ళ పైపు కనెక్షన్ కట్ చేయడం దారుణమన్నారు. మస్జిద్ కు నీళ్లు ఇవ్వద్దనే దూరేద్దేశంతో వ్యవహరించిన AD Civil సురేష్ కుమార్, AD శ్రీకాంత్, se శ్రీనివాస్ లపై విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఆర్మూర్ బల్దియా పై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తం



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ బల్దియా పై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం రోజు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను భాయ్ ఆధ్వర్యంలో ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పేర్కిట్ 22, 20 వార్డులలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మూర్ మున్సిపల్ పట్టణ పరిధిలోని అన్ని వార్డులలో రాబోవు మున్సిపల్ ఎన్నికలలో మా కాంగ్రెస్ కార్యకర్తలను, నాయకులను గెలిపించుకొని ఆర్మూర్ బల్దియా పై కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు ప్రతి వార్డులలో తిరుగుతూ సమస్యలను వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పండిత్ పవన్, కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ పట్టణ అధ్యక్షులు, ఏఎంసీ చైర్మన్ సాయి బాబా గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను భాయ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అందాల పోటీలను నిషేధించాలి





**చట్టం ధర్పల్లి:** స్త్రీలను కించపరిచే అందాల పోటీలను రద్దు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి గోదావరి డిమాండ్ చేశారు. ప్రజా సంస్కృతిని కించపరిచేలా ఉండే అందాల పోటీలు స్త్రీ జాతికి అవమానకరమన్నారు. ధర్పల్లి మండల కేంద్రంలో భీంగల్ ఏరియా 8వ మహాసభ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు . సమాజంలో స్త్రీ తల్లిగా చెల్లిగా ఎన్నో రూపాల్లో గౌరవించబడుతుందని రోజు రోజుకు అలాంటి స్త్రీ తత్వాన్ని దిగదర్చే కార్యక్రమాలు ఇకపై ఉండకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి రాglutla రమేష్ ప్రగతిశీల మహిళ సభ్యులు పాల్గొన్నారు.

## దుబ్బాకలో నర్సరీ, వైకుంఠధామం పంచాయతీ కార్యాలయం తనిఖీ చేసిన.. డిపిఓ



**చట్టం ధర్పల్లి:** దర్పల్లి మండలంలోని దుబ్బాక గ్రామంలో మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు గ్రామపంచాయతీ కార్యాలయాన్ని వైకుంఠధామాన్ని నర్సరీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డు పరిశీలించిన అనంతరం నర్సరీలో ఎండలకు మొక్కలు ఎండిపోతున్నాయని, వాటికి తరచు నీరు అందించాలని కార్యదర్శులకు సూచించారు. వైకుంఠ ధామన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి బాలకృష్ణ ,కార్యదర్శి సాయికుమార్ ,సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్ లో మెరిసిన మోడల్ కాలేజీ విద్యార్థులు

**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని తెలంగాణ ప్రభుత్వ మోడల్ కాలేజీ ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సర పరీక్షా ఫలితాలలో మొదటి సంవత్సరం పరీక్షలో 149 హాజరు కాగా 81 మంది విద్యార్థులు 54 శాతంతో పాసయ్యారు. రెండవ సంవత్సరం విద్యార్థులు 119 హాజరుకాగా 78 మంది విద్యార్థులు 66 శాతంతో పాసయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ తెలియజేశారు. ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం ఎంపీసీ విద్యార్థులు ఆర్ చందన 1000 గాను 981 మార్కులు, ఎన్ లేఖ్య శ్రీ 970 మార్కులు, బైపీసీ విద్యార్థులు జి సాహితీ 1000 గాను 947 మార్కులు, కే సాయి శ్రీజ 862 మార్కులు, సీఈసీ విద్యార్థులు ఎం సౌమ్య 1000 గాను 948 మార్కులు, ఎం మనస్విని 939 మార్కులు, వై కీర్తి, తేజస్విని 910 మార్కులు సాధించినట్లు తెలిపారు.

## అక్రమ నిర్మాణాన్ని తొలగించండి..

**కోర్టు, ఆర్జెడి ఆదేశాలు పట్టించుకోని వైనం.. న్యాయం చేయాలని మొర..**



**చట్టం ప్రతినిధి కామారెడ్డి:** కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని రామేశ్వర పల్లి శివారులో సర్వే నంబర్ 85లో కామారెడ్డి కి చెందిన చిదూర హేమలతకు రెండు ఎకరాల 28 గుంటల భూమి ఉంది,అయితే జీవదాన్ నిర్మల సొసైటీ ఎలాంటి అనుమతులు లేకుండా తమ భూమిలో ప్రహరీ గోడ నిర్మిస్తున్నారని గత 30 రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతుంటే ఎవరు పట్టించుకోవడం లేదని చిదుర హేమలత ఆవేదన వ్యక్తం చేశారు , జీవదాన్ వారు తమ భూమిని కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేపడుతున్నారన్నారుమున్సిపల్ కమిషనర్ అక్రమ నిర్మాణ పనులు ఆపాలని రెండుసార్లు నోటీసులు పంపించామని చెప్పడం జరిగిందన్నారు, అయినా నోటీసులు లెక్కచేయకుండా నిర్మాణాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు, ఈ విషయమై ఇదివరకే మూడుసార్లు దేవునిపల్లి పోలీస్ స్టేషన్ వెళ్లి తమకు సంబంధించిన భూమి పత్రాలు ఇవ్వడం జరిగిందనన్నారు, ఇంజక్షన్ ఆర్డర్ ఉన్న మళ్ళీ నిర్మాణం చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేస్తే తమనే పోలీస్ స్టేషన్ కు రమ్మంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ లు చొరవ తీసుకొని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# SRNK ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 24న సిల్వర్ జూబ్లీ వేడుకలు

**చట్టం, మోస్రా వర్ని :**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం లోని SRNK ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 24వ తేదీన జరగనున్న SRNK ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసినటువంటి మీడియా సమావేశంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి , రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు , పోచారం సురేందర్ రెడ్డి పాల్గొన్న బాన్సువాడ నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు, కాలేజీ ప్రిన్సిపాల్ మరియు అధ్యాపకులు ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ...1994వ సంవత్సరంలో నేను ఎమ్మెల్యే అయిన తర్వాత ఈ ప్రాంత ప్రజలు, నాయకుల కోరిక మేరకు ఈ ప్రాంతంలో డిగ్రీ కళాశాల తీసుకురావాలని, అప్పుడు ఉన్న ఉమ్మడి జిల్లాలో నిజామాబాద్, కామారెడ్డిలో మాత్రమే రెండు డిగ్రీ కాలేజీలు ఉన్నాయి, ఈ ప్రాంతంలో డిగ్రీ కాలేజీ అవసరముందని అప్పటి సీఎం గారి దృష్టికి తీసుకువెళ్లి ఒక సంవత్సరం పాటు కష్టపడితే 17/10/1997 లో కాలేజీ శాంక్షన్ జీవో ఇచ్చారు, 28 ఆగస్టు 1998 లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా కాలేజీని ప్రారంభించుకున్నాం. ఈ కాలేజీ జీవో వచ్చిన తర్వాత స్థలం కోసం చూస్తుండగా



అప్పట్లో ఈ స్థలంలో శ్రీ రామ్ నారాయణ కేడియా గారి ఫ్యాక్టరీ ఉండేది కాలేజీ గురించి వారికి తెలవగానే వారి ఫ్యాక్టరీ స్థలం సుమారుగా 12 ఎకరాల స్థలాన్ని ఉచితంగా విరాళంగా ఇచ్చారు అందుకే ఈ కాలేజీకి ఆయన పేరు శ్రీ రామ్ నారాయణ ఖెడియా ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ అని పెట్టుకున్నాం. ఈ కాలేజీ స్థాపింపబడినప్పటి నుండి ఈ కాలేజీలో పనిచేసిన అధ్యాపకులు గాని ప్రిన్సిపాల్స్ గాని చాలా పట్టుదలతో పని చేశారు. ఇప్పుడు ఈ కాలేజీలో 42 మంది టీచింగ్ స్టాఫ్, 19 మంది నాన్ టీచింగ్ స్టాఫ్, మూడు కంప్యూటర్ ల్యాబ్స్, 12 సైన్స్ ల్యాబ్స్, 52 క్లాస్ రూమ్ లతో అన్ని హంగులతో కొనసాగుతుంది. ఈ కాలేజీ ఏర్పాటు చేసిన సంకల్పం ఏమిటంటే ఈ ప్రాంత పేద మరియు మధ్య తరగతి కుటుంబాల కోసం ఏర్పాటు చేసుకున్నాం. ఈ కాలేజీ ఏర్పాటు చేసిన నుండి గత సంవత్సరం వరకు 13,050 మంది పట్టభద్రులు అవుతే అందులో సుమారు పదివేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగస్తులు ఉన్నారు, మిగతా మూడు వేల మంది ప్రైవేట్ రంగాలలో రాణిస్తున్నారు. ఈ కాలేజీ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఇప్పటితో ఆగకుండా గోల్డెన్ జూబ్లీ, ప్లాటినం జూబ్లీ, డైమండ్ జూబ్లీలతో కొనసాగాలని ఈ పరంపర భవిష్యత్తులో ఉండే నాయకులు,అధ్యాపకులు, విద్యార్థులు కష్టపడి శ్రమించి ఈ కాలేజీ పేరును ఇంకా అత్యున్నత స్థాయికి తీసుకువెళ్లాలని కోరుకుంటున్నాను. ఈ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఎల్లుండి అనగా 24 ఉదయం 10:00 నుండి ప్రారంభించుకొని మధ్యాహ్నం వరకు భోజనం అనంతరం కార్యక్రమం ముగింపబడుతుంది.ముఖ్యంగా ఈ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఈ కాలేజీలో విద్యను అభ్యసించి వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థుల కోసం కావున మీరు ఎక్కడున్నా తప్పకుండా ఈ కార్యక్రమానికి వచ్చి ఈ వేడుకలను విజయవంతం చేయవలసిందిగా కోరుకుంటున్నాను ఎందుకంటే ఈ కాలేజీకి ఇంత మంచి పేరు, ప్రతిష్ట వచ్చిందంటే అది కేవలం మీ మేధస్సు మీ క్రమశిక్షణ అధ్యాపకులు చెప్పింది అమలు చేయడం వల్లే మీరు ఉన్నత స్థాయిలో ఉన్నారు, మీ అనుభవాలను ఇప్పటి విద్యార్థులతో పంచుకొని ఈ వేడుకలను విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను అని మాట్లాడరు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు




## ఉపాధ్యాయుడి పదవి విరమణలో పాల్గొన్న అదిలాబాద్ ఎంపీ నగేష్

**చట్టం, బోథ్ :** సోనాల మండల కేంద్రంలోని బంజారా తాండలో కచ్చకాయాల దశరథ్ ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిహించి గురువారం రోజు పదవి విరమణ పొందరు.సోనాల మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘ భవనం లో సన్మాన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గెడం నగేష్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపే వారు ఉపాధ్యాయులు అని ,బావి భారత పౌరులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు దశరథ్ అని కొనియాడారు.అలాగే బోథ్ మండల ఎంఈఓ మహమూద్ ఉస్సేన్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు తరగతి గదిలో ఉంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ నాయకులు జీవీ రమణ,ఉద్యోగులు,ఉపాధ్యాయులు,గ్రామస్తులు,విద్యార్థులు,దశరథ్ ఆత్మీయులు పాల్గొన్నారు.

## ఎస్డిఎఫ్ ఆర్డబ్ల్యూఎస్ నిధుల విడుదల

**మాజీ శాసనసభ్యులు నారాయణ్ రావు పటేల్.**



**చట్టం, భైంసా :** నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గం లోని భైంసా పట్టణం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో ఎస్ డి ఎఫ్ నుండి (ఆర్డబ్ల్యూఎస్) మిషన్ భగీరథ నిధుల ద్వారా విడుదలైన డబ్బులను మంజూరైనట్లు ముదురు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు బోస్లే నారాయణరావు పటేల్ తెలిపారు. వేసవి కాలం దృశ్య రోజు రోజుకు ఉష్ణోగ్రత వేడి సూర్యుడు భగభగ మండంతో కొన్ని గ్రామలలో తాగునీటి అవసరాల మెరకూ రూ.50లక్షల 30వేల నిధులు విడుదల చేయడం జరిగింది అనిముధోల్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు బోస్లే నారాయణ్ రావు పటేల్ తెలిపారు. రాబోయే రోజుల్లో దశలవారీగా ముధోల్ నియోజకవర్గం లో తాగునీటి అవసరాల కొరకు నిధులను మంజూరు చేస్తామని మాట్లాడేరు మరియు మిషన్ భగీరథ కొరకు నిధులు ఇంకా ఏమైనా అవసరాలు ఉంటే రాబోయే రోజుల్లో దశలవారీగానే ఆ నిధులను కూడా విడుదల చేస్తామని ముదురు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు బోస్లే నారాయణ్ రావు పటేల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ డిప్యూటీ సీఎం బట్టి విక్రమ నీటిపారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ ఉమ్మడి ఇన్చార్జ్ మంత్ర ధనసురి అనసూయ సీతక్కకు ధన్యవాదములు తెలియజేశారు.

## సీనియర్ మేట్లను ఫీల్డ్ అసిస్టెంట్ గా గుర్తించాలి: శ్రీను నాయక్

**పెండింగ్లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలి.**

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శీను నాయక్**



**చట్టం, షాద్ నగర్ ప్రతినిధి:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో (ఎన్ఆర్ఈజీఎస్) అనేక సంవత్సరాలుగా సీనియర్ మేట్లుగా పనిచేస్తున్న వారిని ఫీల్డ్ అసిస్టెంట్ లుగా గుర్తించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు, షాద్నగర్ నియోజకవర్గ కన్వీనర్ శ్రీను నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఫరూక్నగర్ మండలంలోని కడియాలకుంట తండాలో మంగళవారం ఉపాధి హామీ పనులు చేస్తున్న కార్మికులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్న శ్రీను నాయక్, అనంతరం మాట్లాడుతూ... ఎండలో కష్టపడుతున్న కార్మికులకు 9 వారాలుగా పెండింగ్ లో ఉన్న కూలి డబ్బులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని స్పష్టం చేశారు. కనీస పని దినాలను 100 నుండి 200 రోజులకు పెంచాలని, కనీస వేతనాన్ని రూ.307 నుండి రూ.800 వరకు పెంచాలని డిమాండ్ చేశారు.మెజర్మెంట్ లేకుండా పని కల్పించాలని, ఎండ తాళలేని పరిస్థితుల్లో మంచినీటి సదుపాయం, మెడికల్ కిట్ లు అందుబాటులోకి తేవాలని కోరారు. కొత్తగా దరఖాస్తు చేసిన వారికి పని కల్పించి జాబ్ కార్డులు జారీ చేయాలని ఆయన అన్నారు.ఇప్పటికే ఈ అంశాలపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోకపోతే, ఉపాధి హామీ కార్మికులతో ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికులు శంకర్, దీప్లా నాయక్, లింగం నాయక్, సంతోష్ నాయక్, లోక, ముత్యాలు, గౌరీ శంకర్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలి

**ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్**



**చట్టం, తానూర్ :** నిర్మల్ జిల్లా ముదురు నియోజకవర్గం లోని తానురు మండలం పరిధిలోని బెల్చరోడా గ్రామంలో విశ్వ రత్న పరమ పూజ భారతరత్న డాక్టర్ 134వ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ముధో నియోజకవర్గ శాసనసభ్యులు పవర్ రామారావు పటేల్ పాల్గొని అంతకుముందు పంచశీల నీలి జెండాలను త్రిశరణ పంచశీల వందనం తీసుకొని ప్రత్యేక పూజలు జరిపి అనంతరం గ్రామంలో చౌరస్తా వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి భారీ గజమాలతో ఎమ్మెల్యే విగ్రహానికి సత్కరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం వారు సభను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు అంబేద్కర్ అడుగుజాడల్లో నడుస్తూ ముఖ్యంగా యువత బానిస బతుకుల నుండి విముక్తులై బుద్ధుని బోధించిన బోధిసత్వ సన్మార్గాలను ఎంచుకొని నిత్యం మనిషి బుద్ధుని స్మరిస్తూ అంబేద్కర్ గతంలో ఎన్నో అవమానాలు పొంది అనేక డిగ్రీలు సంపాదించి ప్రపంచ జాతిగా ఒక వ్యక్తి నిలిచిన మన దేశంలో ఎంతో గర్వకారణం అని గొప్ప రాజ్యాంగాన్ని రచించి ప్రపంచంలోని భారీ రాజ్యాంగమైన మన దేశంలోని ఉందని అందరూ మంచి చదువులు చదువుకొని ఉద్యోగాలు సాధిస్తే పేదరికం నిర్మలం అయిపోతుందని సంసార జీవితంలో వాణిజ్య మౌలిక సదుపాయాల ద్వారా మనిషి జీవితం మెరుగుపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ ఉపవాసకులు ఉపాసికులు బిజెపి కార్యకర్తలు ప్రజాప్రతినిధులు గ్రామస్తులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# భూ భారతి చట్టం రైతులకు చుట్టం

- **రైతన్నల భూ హక్కులు కాపాడటానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది**
- **రైతుల పెండింగ్లో ఉన్న సమస్యలు త్వరతగతిన పరిష్కరించాలి**




**చట్టం, బోథ్ :** ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా రాష్ట్ర ప్రభుత్వం భూ యాజమాన్య హక్కులు కాపాడటానికి, రైతులకు భూమికి సంబంధించిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడానికి, భూమికి సంబంధించిన రికార్డులు ఆన్లైన్ ఆఫ్ లైన్ ఉండటం కోసం ఆర్ఓఆర్ చట్టంలో దాదాపు 24 సవరణలు చేసి పారదర్శకంగా భూభారతి చట్టాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు రాష్ట్ర మంత్రివర్గం తీసుకువచ్చిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. బోథ్ మండలంలోని ధన్నూర్ బి గ్రామంలో ఏర్పాటు చేసిన భూభారతి చట్టం అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా హాజరయ్యారు. గ్రామస్తులు మేళతాళాలతో ఆహ్వానించగా విద్యార్థులు గౌరవ వందనం సమర్పిస్తూ వేదిక దగ్గరికి తీసుకువచ్చారు అనంతరం జిల్లా అధికారులు, గ్రామస్తులు జాతీయ ఉత్తమ పరిపాలన అవార్డు అందుకున్న కలెక్టర్ ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరణి పోర్టల్ తీర్చనిఅనేక సమస్యలకు భూభారతి చట్టం పరిష్కారం చేస్తుందని, జిల్లా లెవల్లో కూడా అప్పీల్ కు అవకాశాలు ఉన్నాయని, ల్యాండ్ ట్రిబ్యునల్స్ కూడా ఏర్పాటు చేసే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరికి భూదార్ కార్డులు అందిస్తామని, సాదాబయ్ నామ సమస్యలు, అసైన్డ్ భూముల సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని గ్రామ పరిపాలన అధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ధన్నూర్ గ్రామంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పొలంబాట కార్యక్రమంలో పంట పొలాలకు త్వరలోనే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్లు వేయిస్తామని, అటవీ రెవెన్యూ అధికారుల సంయుక్త సర్వే నిర్వహించి అర్హత కలిగిన రైతులకు పట్టాలు అందించే కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎంపిక చేసిన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి అర్హతలు తెలుసుకున్నారు. భూభారతి చట్టానికి సంబంధించి నాటిక వేసిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు వేసిన నాటకానికి జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భోద్దు గంగారెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో టి వినోద్ కుమార్, బోథ్ మండల స్పెషల్ ఆఫీసర్ వాజిత్, మండల తహసిల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ విస్తీర్ణ అధికారి, ఏపీవో, ఏపీఎం, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల జీవన పరిస్థితులు మెరుగుపరుస్తాం

- **అంత్యోదయ అన్న యోజన కార్డులను అందజేసిన రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు.**



**చట్టం.ఏలూరు /బట్టాయిగూడెం :**

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు మెరుగైన జీవన పరిస్థితులు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి మరియు జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ చెప్పారు. మంగళవారం బుట్టాయిగూడెం మండలం రెడ్డి గణపవరం లోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు అంత్యోదయ అన్న యోజన కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కాలనీలోని నిర్వాసితుల సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. అత్యంత ప్రతిష్టాత్మకమైన జాతీయ బహుళార్ధసాధక సాగునీటి ప్రాజెక్ట్ అయిన పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి తమ భూములు త్యాగంచేసిన 35 వేల మంది నిర్వాసితుల త్యాగాలను తమ ప్రభుత్వం ఎప్పటికీ మరచిపోదని, వారిని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల పోలవరం పర్యటన సందర్భంగా నిర్వాసితుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, వాటిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. నిర్వాసితులకు ఆహార భద్రతాకీ అంత్యోదయ అన్నా యోజన కార్డులు అందజేసి వారికి ప్రతినెలా 35 కేజిల బియ్యన్ని ఉచితంగా అందిస్తున్నామన్నారు. నిర్వాసితుల కుటుంబాలలోని యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, ఇందుకోసం ప్రత్యేక సర్వేని నిర్వహిస్తామన్నారు. పునరావాస కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యా, వైద్యం తదితర మౌలిక సదుపాయాలను ఆరు నెలలులోగా కల్పించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కాలనీలలో ఎట్టిపరిస్థితులలోను త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పోలవరం నియోజకవర్గంలో రోడ్డు అభివృద్ధికి గత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే రూ.27 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో రూ.20 కోట్ల రూపాయలు మంజూరు చేస్తామని మంత్రి చెప్పారు. నిర్వాసితులకు నిబంధనల మేరకు పరిహారాన్ని పూర్తిస్థాయిలో అందిస్తామన్నారు. రాష్ట్రంలో 4.64 కోట్ల రైస్ కార్డు హోల్డర్లకు ప్రతినెల బియ్యన్ని అందిస్తున్నామన్నారు. కొత్త రేషన్ కార్డుల జారీని త్వరలో చేపడతామని మంత్రి చెప్పారు. కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా సమాన ప్రాధాన్యతనిస్తున్నదని, రాష్ట్రంలోని 63 లక్షల మందికి ప్రతినెల రూ.2 వేల 700 కోట్ల రూపాయలను పెన్షన్లుగా అందిస్తున్నామన్నారు. రానున్న విద్యా సంవత్సరం నుండి రూ.9 వేల 600 రూపాయలతో తల్లికి వందనం పథకం ద్వారా కుటుంబంలో పథకం వర్తింప చేస్తామన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమీషనర్ సౌరబ్ గౌర్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు అంత్యోదయ అన్నా యోజన కార్డులు అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించిన వెంటనే పునరావాస కాలనీలో మొదటివిడతలో సర్వే చేసి కార్డులు అందిస్తున్నామని, ఇంకా అర్హులెవరైనా ఉంటే వారికి కూడా అందిస్తామన్నారు.

జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ.. ముంపు గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి అంత్యోదయ అన్నా యోజన అర్హులని గుర్తించడం జరిగిందన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసిత కుటుంబాలకు ప్యాకేజి తో పాటు ఆయా కుటుంబాలు జీవన ప్రమాణాల స్థాయిని పెంచేందుకు వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నమన్నారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ పేదల, రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతను ఇస్తున్నదన్నారు. ఎన్నడూలేని విధంగా రైతుల నుండి సేకరించిన ధాన్యానికి 6 నుండి 24 గంటలలోగా వారి ఖాతాలకు కూటమి ప్రభుత్వం సొమ్ము జమచేసిందన్నారు. 18 సంవత్సరాల వయస్సు నిండిన యువతకు, పెళ్ళైనవారికి కూడా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి అందించాలన్న నిర్వాసితుల విజ్ఞప్తిని పరిలిస్తామని మంత్రివర్యులు చెప్పారు.

కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, ఐటిడిఏ పివో రాములు నాయక్, ఉంగుటూరు శాసన సభ్యులు పత్సమట్ల ధర్మరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, ఆర్ టిసి జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఆర్డిఓ ఎం.వి. రమణ, తహశీల్దారు అచ్యుత్, జనసేన నాయకులు కొటికలపూడి గోవిందరాజు, కరాటం సాయి, గడ్డమనుగు రవి, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## దాచుకున్న సొమ్ము దోచుకెళ్లిన దొంగలు

**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని యోగేశ్వర కాలనీకి చెందిన తోగటి భూమేశ్వర్, ఉదయం 9 గంటల ప్రాంతంలో ఆయన ఇంటికి తాళం వేసి మామిడిపల్లి లోని వృద్ధాశ్రమానికి వెళ్ళారు. ఇంటికి తాళం వేసి ఉన్నది గమనించిన గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించి దాచుకున్న సొమ్మును దోచుకెళ్లారు. బీరువాలో దాచి ఉంచిన సుమారు 5 తులాల బంగారు ఆభరణాలు, 800 గ్రాముల వెండి ఆభరణాలను దోచుకెల్లడం జరిగిందని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఆర్మూర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ పి.సత్యనారాయణ గౌడ్ తెలిపారు.

## బర్రెను కాపాడే ప్రయత్నంలో వ్యక్తి మృతి



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామ శివారు లోని గుండ్ల చెరువు దగ్గర బర్రెలను మేపుతుండగా, చెరువులో పడిన బర్రెను కాపాడే ప్రయత్నంలో ఇందల్వాయి మండలం గౌరారం గ్రామానికి చెందిన ముద్దంగుల రమేష్ తండ్రి పేరు ఓడ్డయ్య అనునతుడు చెరువులో దిగగా చెరువు నీటిలోని చేపల వలకు తట్టుకొని ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోవడం జరిగింది. మృతుడి భార్య ముద్దంగుల అపర్ణ, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఆర్మూర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ పి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.


## అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం



**చట్టం, తానూర్ :** నిర్మల్ జిల్లా తాండూర్ మండలం పరిధి లోని గ్రామంలో మంగళవారం విశ్వరత్న పరమ పూజ్య బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ భీమ్రావు రాంజీ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు అంతకుముందు నీలి పంచరంగుల జెండాలను ప్రత్యేక వందనం తీసుకొని పూజలు చేపట్టి అనంతరం విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. ఈ నేపథ్యంలో జయంతి వేడుకల్లో భాగంగా అన్నదాత, చందరే శివరాం అందరికీ అంబేద్కర్ జయంతి శుభ సందర్భంగా ఉచితంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు అంబేద్కర్ ఆశయాలను సాధించాలని వారి అడుగుజాడలో నడుస్తూ వారు చేపట్టిన 34 డిగ్రీలను కనీసం మనకు తగినంత డిగ్రీలు పూర్తి చేసి వారి అడుగుజాడలు నడుస్తూ వారి ఆశలను సాధిస్తూ అంబేద్కర్ ను స్ఫూర్తిగా తీసుకుంటూ ఉన్నత చదువులు చదివితే మనిషి శేష జీవితంలో ఎప్పటికైనా విజయం తమ దాసోహం అవుతుందని అన్నారు. ముఖ్యంగా యువత బానిస గుట్కా మత్తు పదార్థాలను విడనాడి మంచి మార్గాన్ని ఎంచుకుంటే అప్పుడే అన్నారు. అంబేద్కర్ ఎప్పటికైనా ఒక రోజు భారతదేశం బౌద్ధమయం అవుతుందని అయితేనే మనం బుద్ధుని సన్మార్గంలో నడిచినట్టు ఉంటుందని తెలిపారు అనంతరం గ్రామ పురవీధుల గుండా డీజే సౌండ్ మధ్య నృత్యాలు చేస్తూ శాంతియుతంగా శోభయాత్ర ర్యాలీ చేపట్టి అంతకు ముందు ఒకరోజు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ జీవిత చరిత్రపై పాటలు పాడుతూ అందరూ ఒక పండుగలాగా అంబేద్కర్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు.. ఈ కార్యక్రమంలో బౌద్ధ ఉపాసకులు ఉపాసికులు గ్రామస్తులు ఇతర గ్రామస్తులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీ హనుమాన్ మహా యజ్ఞానికి ఆహ్వానం

## మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావు పటేల్



**చట్టం, భైంసా :** నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గం లోని కుబీర్ మండల కేంద్రంలో అతి పురాతమైన శ్రీ విఠలేశ్వర మందిరంలో ఈనెల 28న జరగనున్న శ్రీ మహా హనుమాన్ మహా యజ్ఞానికి కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను మంగళవారం నారాయణ పటేల్ కు అందజేశారు. శ్రీ హనుమాన్ మహా యజ్ఞం కి ముఖ్య అతిథిగా నారాయణ్ రావు పటేల్ ముదురు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని కమల జిన్నీ ఫ్యాక్టరీ కాంగ్రెస్ ప పటేల్ స్వగృహంలో లోనీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అఖిల భారత శ్రీ హనుమాన్ దీక్ష సేవా సమితి భైంసా విభాగ్ ముధోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు బోస్లే నారాయణ్ రావు పటేల్ గారి నీ శ్రీ హనుమాన్ మహా యజ్ఞం , శ్రీ శ్రీ శ్రీ దుర్గా ప్రసాద్ స్వామీజీ వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో మహా యజ్ఞం ఉంటుందని ఈనెల 28న సోమవారం రోజున ఉదయం 8 గంటల కూ ముఖ్య అతిథిగా పాల్గొనాలని ఆహ్వానించారు అనంతరం నారాయణరావు పటేల్ సానుకూలంగా స్పందిస్తూ తప్పకుండా ఇటువంటి బ్రహత్తరమైన కార్యక్రమాలకు వస్తానని స్పందించారు ఈ కార్యక్రమంలో కుబీర్ విట్టలేశ్వర ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల సదస్సు



**చట్టం ఆర్మూర్:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆర్మూర్ డిపో ఆధ్వర్యంలో మంగళవారం రోజు అంకాపూర్ గ్రామంలో ప్రయాణికుల సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో రీజనల్ మేనేజర్ జ్యోత్స్న, డిప్యూటీ మధుసూదన్, ఆర్మూర్ డిపో మేనేజర్ రవికుమార్ హాజరయ్యారు. విడిసి సభ్యులు, ప్రయాణికులతో రీజనల్ మేనేజర్ మాట్లాడుతూ, అంకాపూర్ విలేజ్ లో నిజామాబాద్ జిల్లాకు చెందిన లగ్జరీ బస్సులు, డీలక్స్ బస్సులు, సెమి డీలక్స్ బస్సులు ఉన్నవి నిజామాబాద్ నుండి అంకాపూర్ కు 144 ట్రిప్పులు, అంకాపూర్ మీదుగా ఆర్మూర్, వరంగల్, నిర్మల్, ఎక్స్ ప్రెస్ సెమి డీలక్సు, ఆర్డినరీ బస్సులు వెళ్ళను అట్టి బస్సులను మీరందరూ ఆదరించాలన్నారు. మహిళా ప్రయాణికులతో సహా పురుషులు కూడా మా బస్సులో ప్రయాణించాలని ఆర్టీసీ బస్సులను ఆదరించాలని అంకాపూర్ గ్రామస్తులను కోరారు. ఈ ప్రయాణికుల సదస్సులో గ్రామ వీడిసి సభ్యులు, ప్రయాణికులు, డిప్యూటీ ఆర్ ఎం, ఆర్మూర్ డిపో అసిస్టెంట్ మేనేజర్, ట్రాఫిక్ సావిత్రి, సేఫ్టీ వార్డెన్ ఎన్వివి రెడ్డి, పాల్గొన్నారు.

## గురు పీఠంలో ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న దేవాలయాలు

**నేడు, రేపు జైపూర్ నుండి సాయిబాబా దత్తాత్రేయ విగ్రహాలు రాక**



**చట్టం, శివ్వంపేట :** మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రం శివారులోని గూడూరు గ్రామపంచాయతీ పరిధిలో అదే గ్రామానికి చెందిన రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది జిన్నారం పెద్ద గౌని శివకుమార్ గౌడ్, రమాదేవి ,దంపతులు వారి దైవ సంకల్పంలో భాగంగా అక్కడే ఉన్న వారి సొంత స్థలంలో కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ పవిత్ర పుణ్యక్షేత్రంగా మారాలని సంకల్పంగా అక్కడే ఉన్న వారి సొంత స్థలం లో షిరిడి సాయిబాబా, దత్తాత్రేయ స్వామి ,దేవాలయాలను నిర్మిస్తున్నారు. దాదాపు ఈ దేవాలయాలు ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్నాయి. మే నెలలో దేవాలయాలలో సాయిబాబా, దత్తాత్రేయ ,విగ్రహాలను ప్రముఖ వేద పండితులు, ఆస్థాన పండితుల చేతుల మీదుగా ప్రతిష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ దేవాలయాల నిర్మాణం మొదలు అయినప్పటి నుండి శ్రీ గురు పీఠంలో ఉత్సవ విగ్రహాలకు ప్రతిరోజు మహా పూజలు నిర్వహిస్తూనే ఉన్నారు. ఈ దేవాలయాలు ప్రారంభమౌతే ఈ ప్రాంతానికి పవిత్ర పుణ్య క్షేత్రంగా పేరు ప్రఖ్యాతలు రానున్నాయి. హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్ గౌడ్ రమాదేవి ల సంకల్పం కూడా నెరవేరనుందని పలువురు ప్రముఖులు మీడియాతో మాట్లాడుతూ అంటున్నారు. సాయిబాబా, దత్తాత్రేయ స్వామి దర్శనానికి భక్తుల తాకిడి కూడా పెరిగి భక్తి శోభా సంతరించుకోనుంది. రాజస్థాన్ జైపూర్ నుండి వస్తున్న విగ్రహాలను శివంపేట గూడూరు గ్రామాల లో ,భజనలతోపాటు వేద పండితుల ఆధ్వర్యంలో పూజలతో పాటు, భజనలతో, భక్తులు, ప్రముఖుల, ఆధ్వర్యంలో ఊరేగింపు కార్యక్రమం కూడా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి హైకోర్టు న్యాయవాది శివకుమార్ గౌడ్, తాజా మాజీ సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి శ్రీనివాస్ గౌడ్, అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణప్రాంతాని కె, ప్రాముఖ్యత శోభ లభిస్తుంది. ప్రముఖ శిల్పులతో నిర్మించిన ఈ దేవాలయాలు అంగరంగ వైభవంగా దర్శనమిస్తున్నాయి .తమభక్తి సంకల్ప భావంతో ఈ పుణ్యక్షేత్రాలు నిర్మిస్తున్న హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్ గౌడ్ ,రమాదేవి ,దంపతులను పలువురు ఆస్థాన పండితులు ,ప్రముఖులు ,మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలు ,అభినందిస్తూ వందనాలు చెబుతున్నారు.

CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

## 19 వార్డులో జై భీమ్ జై సంవిధాన్..



**చట్టం ప్రతినిధి కామారెడ్డి:** కామారెడ్డి పట్టణంలోని 19 వార్డులో మాజీ కౌన్సిలర్ చింతల రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాల గురించి కూడా వార్డు ప్రజలను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కారంగుల అశోక్ రెడ్డి, పండ్ల రాజు, జమీల్, సిరాజ్, వార్డు నాయకులు అజీజ్, ఇక్రమ్, కిషన్ , సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల కన్నా బడాబాబులే మిన్నగా కేంద్ర ప్రభుత్వం తలంపు

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విమర్శ**
**కొందుర్గులో 'జై బాపు – జై భీమ్ – జై సంవిధాన్' పాదయాత్ర**
**శ్రీరంగాపూర్ వద్ద ఘన స్వాగతం**



**చట్టం, షాద్ నగర్ ప్రతినిధి:** రాజ్యాంగం అమలై 75 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా నిర్వహిస్తున్న 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' పాదయాత్రలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం కొందుర్గు మండల కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ...ప్రధాని మోడీ, అమిత్ షా లకు పేదల కన్నా బడాబాబులే ముఖ్యమైపోయారని మండిపడ్డారు.రాజ్యాంగాన్ని కేవలం పుస్తకం లాగా చూడొద్దని, అది అంబేద్కర్, గాంధీ, పూలే వంటి మహానుభావుల ఆలోచనల సమాహారమని స్పష్టం చేశారు. పార్లమెంట్ సాక్షిగా బీజేపీ రాజ్యాంగాన్ని అణగదొక్కాలని చూస్తోందని ఆరోపించారు. అమిత్ షా అంబేద్కర్‌ను అవమానించారని తీవ్రంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం, కాంగ్రెస్ నాయకులు చెన్నయ్య, బాలరాజ్ గౌడ్, పురుషోత్తం రెడ్డి, ఇబ్రహీం, శ్రీకాంత్ రెడ్డి, బస్వం తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**ప్రజా ప్రభుత్వ నిబద్ధతపై అభిమానం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు, ఉచిత రేషన్, ఆరోగ్యశ్రీ, ఉచిత ఆర్టీసీ ప్రయాణం, గ్యాస్ సబ్సిడీ లాంటి పథకాలను దశలవారీగా అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు.

**శ్రీరంగాపూర్‌లో బైక్ ర్యాలీ, ఘన స్వాగతం**

శ్రీరంగాపూర్ వద్ద ఎమ్మెల్యే శంకర్‌కు మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ సాదిక్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ, నినాదాలతో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. పల్లె మహేందర్ రెడ్డి సహా స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అర్హులైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇండ్లు




**చట్టం, బోథ్ :** అర్హులైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వబడతాయని బోథ్ ఎంపీడీఓ రమేష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రఘునాథపూర్, కండిపల్లి, నారాయణపూర్, అందురు, మందబోగడ, కూచిర్యాల తండా గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీల ద్వారా ప్రాథమికంగా ఏంపిక చేయబడిన అర్హుల ఇంటి స్థితిని వారి ఆర్థిక పరిస్థితిలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల స్థలాలను పరిశీలించారు.

## ఘనంగా కామ్రేడ్ లెనిన్ 155 వ జయంతి వేడుకలు



**చట్టం, నిజామాబాద్:** సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కామ్రేడ్ లెనిన్ 155 వ జయంతి సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఆవిర్భవం నిజామాబాద్ జిల్లా నాగారంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు గంగాధర్ మాట్లాడుతూ.. దోపిడి నూతన సమాజాన్ని ఆకాంక్షించిన వాడు లెనిన్ అని పేర్కొన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకత్వంలో దేశంలో నక్సల్ బరి శ్రీకాకుళం నాయకత్వంలో దేశంలో నక్సల్బరీ శ్రీకాకుళం గోదావరి లోయ ప్రతిఘటన పోరాటాలు జరిగాయని గుర్తు చేశారు. ఆదివాసులకు దళితులకు లక్షల ఎకరాల భూములను పంచడం జరిగిందన్నారు. భూస్వామ్య దళారి పాలనకు వ్యతిరేకంగా పోరాడాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కగర్ ఆపరేషన్ పేరుతో అమాయకమైన గిరిజలను నక్సలైట్లను చంపుతున్న కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ నిలిపివేయాలని అన్నారు. శాంతి చర్చలు జరపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షులు శివరాజ్ రవి రాములు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



**చట్టం, భైంసా :** నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గం లోని భైంసా కుంటల కుబీర్ లోకేశ్వరం ముధోల్ బాసర తాండూర్ మండల్ లో ఈరోజు మంచి ముహూర్తం ఉండడంతో పెండ్లి నూతన శుభకార్యాలు జరుగగా ముదురు నియోజకవర్గ శాసన సభ్యులు పవర్ రామారావు పటేల్ పాల్గొని నవ వధూవరులను ఆశీర్వదించారు. వారి శేష జీవితంలో నిండు నూరేళ్లు సుఖంగా ఉండాలని కోరుతూ అక్షంతలు వేసి తమ దివ్యమైన ఆశీస్సులు అందించారు. అనంతరం బంధువులతో కలిసి శాతం భోజనం చేసి అందరి పట్ల ప్రేమానురాగాలతో మాట్లాడుతూ.. ఎంతో ఆనందంగా ఉన్నారు వీరి వెంట ప్రజా ప్రతినిధులు భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు బంధువులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో ఎస్ఆర్కే.. వీఆర్కే విద్యార్థుల ముందంజ..



**చట్టం కామారెడ్డి ప్రతినిధి:** ఇంటర్ ఫలితాల్లో పట్టణంలోని ఎస్ఆర్కే, వీఆర్కే విద్యార్థులు ముందంజలో ఉండి ప్రభంజనం సృష్టించారు. ఫస్టియర్లో వీఆర్కే కళాశాలకు చెందిన మైథిలి ఎంపీసీ 467/470, నవోదయ బైపీసీ 434/440, అనన్య సీఈసీ 491/500, ఒకేషనల్ ఫలితాలలో అఖిల ఎంపీహెచ్డబ్ల్యూ 496/500, ప్రభంజన్ ఎంఎల్టీ 488/500, జస్వంత్ ఈటీ 464/500 సాధించగా సెకండియర్లో ఏ.పూర్వజ బైపీసీ 994/1000, విద్వేష్ ఎంపీసీ 993/1000, నందిని సీఈసీ 935/1000 మార్కులు సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో విద్యార్థులు వివిధ గ్రూపులలో స్టేట్ టాపర్లుగా నిలిచారు. అలాగే ఎస్ఆర్కే కళాశాలకు చెందిన విద్యార్థులు సెకండియర్లో ఇందువర్షా 991/1000, ఇంటర్ సెకండియర్లో శ్రీచరణ్ ఎంపీసీ 464/470, శ్రీజ సీఈసీ 461/600 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, సీఈవో డా.జైపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ నరేష్ కుమార్, ఎస్ఆర్కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దత్తాత్రి, శంకర్, డీన్ నవీన్ కుమార్, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మహేష్ కుమార్, బాల్ రెడ్డి, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందూర్ ఎంబీఏ కళాశాలలో జాబ్ మేళ




**చట్టం, బోధన్:** మంగళవారం నాడు ఇందూర్ స్కూల్ యాజమాన్యం కొడాలి కిషోర్, ఇందూర్ ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ మదన్ మోహన్ అధ్యాపకుల అద్వర్యం లో బోధన్ పట్టణం లోని అచంపల్లి లో గల ఇందూర్ ఎంబీఏ కళాశాలలో జాబ్ మేళ నిర్వహించారు.. టాస్క్ నిర్వాహకులు హన్మంత్ అద్వర్యం లో యాక్సెస్,హెచ్ డి ఎఫ్ సి బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలను నిర్వహించగా వివిధ కళాశాలల దాదాపుగా 200 మంది విద్యార్థులు జాబ్ మేళాలో పాల్గొనగా అందులో 17 మందిని ఎంపిక చేశారు.

# ధరణి ఇబ్బందులు.. భూభారతితో దూరం

**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్.**



**చట్టం రాజన్న సిరిసిల్ల :** ధరణి చట్టంతో రైతులు, ప్రజలు పడ్డ ఇబ్బందులు నూతన భూభారతి చట్టంతో దూరం కానున్నాయని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూ భారతి చట్టంపై రుద్రంగిలో అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించగా, ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడారు..ధరణి చట్టం రావడం తో రైతులు, ప్రజలు ఇబ్బంది పడ్డారని గుర్తు చేశారు. గత పదేండ్లు అసైన్డ్ కమిటీ లేకపోవడంతో ఇంకా చాలా కష్టాలు పడ్డారని వివరించారు. ధరణి ఇబ్బందులు దూరం చేయాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇతర మంత్రులు, నిపుణులు, అధికారులు భూ భారతి చట్టాన్ని రూపొందించారని తెలిపారు. భూముల విషయంలో రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బంది పడవద్దని సీఎం రేవంత్ రెడ్డి ఆశయమని స్పష్టం చేశారు. అతి తక్కువ కాలంలోనే భూ భారతి చట్టాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్ట్ కింద అమలు చేస్తున్నారని తెలిపారు వీటిలో ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఎదురైతే వాటిని పూర్తి స్థాయిలో పరిష్కరించి త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నామని వెల్లడించారు. రైతును రాజును చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశమని, ఇందులో భాగంగానే రుణ మాఫీ చేసిందని తెలిపారు. దాదాపు రూ. 20 వేల కోట్ల రుణ మాఫీ చేసిందని వెల్లడించారు. సన్న రకం ధాన్యం పండించే రైతులకు క్వింటాల్కు అదనంగా రూ ఐదు వందలు ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని రైతులు దీని ద్వారా దాదాపు రూ. 32 కోట్ల లబ్ది అదనంగా పొందారని విప్ వెల్లడించారు. సన్న రకం ధాన్యం తో సన్న బియ్యం పేదలు సద్వినియోగం చేసుకుంటూ ఆనందంగా ఉన్నారని తెలిపారు. భూభారతి చట్టం.. రైతుల చుట్టమని వివరించారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ధరణి చట్టం.. భూభారతి చట్టం లోనీ వివరాలు, బేధాలను, లాభాలను వివరించారు.

అర్హుల భూ సమస్యల పరిష్కారం.. హక్కుల పంపిణీ జిల్లాలోని అర్హులైన వారందరీ భూ సమస్యలు భూ భారతి చట్టంలో భాగంగా పరిష్కరిస్తామని, హక్కులు పంపిణీ చేస్తామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. అంతకముందు చందుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో భూ భారతి అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించగా, కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై భూ భారతి చట్టంపై రైతులు, ప్రజలకు ప్రెజెంటేషన్ ద్వారా క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ధరణి, భూ భారతి కి మధ్య వ్యత్యాసాలు, దరఖాస్తు దారులకు ఇబ్బందులు లేకుండా భూ భారతిలో పొందుపరచిన అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో నెలకొన్న భూ సమస్యలకు భూ భారతి ద్వారా శాశ్వత పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. మనుషులకు ఆధార్ నెంబర్ మాదిరిగా భూములకు భూధార్ నెంబర్ ఇస్తారని వెల్లడించారు. సదస్సు అనంతరం స్థానిక రైతులు, ప్రజల సమస్యలు విని, దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, చందుర్తి తాసిల్దార్ శ్రీనివాస్, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతితో రైతులందరికి న్యాయం

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



**చట్టం, మెదక్ :** భూ సమస్యల పరిష్కారానికి గొప్ప వేదిక భూ భారతి నూతన ఆర్వోఆర్ 2025, చట్టం అని జిల్లా కలెక్టర్, రాహుల్ రాజ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం 25, అవగాహన సదస్సు మంగళవారం శంకరంపేట (A) మండల కేంద్రంలో రైతువేదిక లో *జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ , ఆర్డిఓ రమాదేవి, మండల ప్రత్యేక అధికారి ఆర్ అండ్ బి ఈ సర్దార్ సింగ్, స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో విటల్ రెడ్డి, సంబంధిత రైతులుతో కలిసి కలెక్టర్ హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలనతో , కార్యక్రమం ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు సందేశం రైతులకు భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టంపై అవహన కల్పించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న భూ భారతి నూతన ఆర్వోఆర్ చట్టం అని ప్రతి భూ సమస్య సులభంగా పరిష్కారం కోసం ఈ పోర్టల్ చాలా ఉపయోగ పడుతుందని, గతంలో చిన్న చిన్న భూ విషయాలు, సమస్యలు పరిష్కారం తమ పరిధిలో లేక అనేక ఇబ్బందులు ఏర్పడేవన్నారు, ఇప్పుడు సామాన్య ప్రజలకు, రైతులకు అందుబాటులో భూ సమస్యలు పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు సూచించారు జారీ చేయడం జరిగిందని, రైతు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి అధికారులకు కేటాయించిన సమయంలో రైతుల దరఖాస్తుకు సమాధానాలు పరిష్కారం చూపే విధంగా ఈ కొత్త చట్టం ఉంటుందని అన్నారు, పూర్తిగా న్యాయమైన భూ సమస్యలను ప్రభుత్వం సూచించిన భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టం ప్రకారం పరిష్కారం చేయుటకు పూర్తి అధికారాలు గ్రామ అధికారి తహసిల్దార్ రెవిన్యూ డివిజనల్ అధికారి కలెక్టర్ స్థాయి లలో ఇప్పుడు వర్తిస్తుందని రైతులు ఎలాంటి భూ సమస్యలకైనా అప్పీల్ ద్వారా హక్కును పొంది స్వేచ్ఛ రైతులకు ప్రజలకు ఉంటుందని అన్నారు. గత ధరణి పోర్టల్ ద్వారా సామాన్య రైతులకు రెవెన్యూ అధికారులు న్యాయం చెయ్యలేక పోయారని, ప్రతి చిన్న విషయానికి సివిల్ కోర్టులకు వెళ్ళే వారని, కొందరు రైతులు కోర్టుకు వెళ్లే అంత ఆర్థిక స్తోమత లేకపోయేసరికి భూ సమస్యలను అలానే వదిలివేసారని, గుర్తుకు చేశారు, ప్రస్తుత ప్రభుత్వం క్షేత్రస్థాయిలో భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గొప్ప వేదిక కల్పించిందని, (జీపిఓ) గ్రామ స్థాయిలో ఒక్క అధికారిని నియమించి వారస్వతం, ఏజెన్సీ భూ హద్దులు తదితర అంశాలపై వారికి నిర్దేశించిన సమయంలో కచ్చితంగా న్యాయం జరిగే విధంగా ఈ భూ భారతి నూతన ఆర్వోఆర్ చట్టం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 26 న పలు వాహనాల వీడి భాగాల వేలం పాట

**వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీ కె.నారాయణ రెడ్డి**



**చట్టం వికారాబాద్ ప్రతినిధి :** జిల్లా ప్రజలకు మరియు ఆసక్తిగల వ్యాపారులకు తెలియజేయునది ఏమనగా, జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో, పోలీస్ వాహనాలకు వాడబడినటువంటి పాత టైర్లు, ట్యూబులు, బ్యాటరీలు మరియు వివిధ రకాల వాహనముల విడి భాగాలను బహిరంగ వేలం వేయాలని నిర్ణయించడమైనది. ఈ వేలంపాట తేదీ 26.04.2025 (శనివారం) నాడు ఉదయం 10:00 గంటలకు జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఆవరణ నందు నిర్వహించబడుతుంది. కావున, ఈ వేలంపాటలో పాల్గొనదలచిన ఆసక్తిగల పౌరులు/వ్యాపారులు నిర్ణీత తేదీ మరియు సమయానికి జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో హాజరై, వేలంపాటలో పాల్గొనవచ్చునని జిల్లా ఎస్పీ గారు తెలియజేయడం జరిగింది. ఇట్టి విషయం పైన ఏదైనా సమాచారం కొరకు ఆర్ఐ అంజాత్ పాషా గారిని సెల్ నెంబర్ 8712670028 సంప్రదించవచ్చు అని జిల్లా ఎస్పీ గారు తెలియజేయడం జరిగింది.

## రైతుల సంక్షేమం కొరకే కొనుగోలు కేంద్రాలు

**గ్రంథాలయ చైర్మన్ సుహాసినిరెడ్డి.**



**చట్టం, శివ్వంపేట :** వ్యవసాయంపైనే పూర్తిగా ఆధారపడి ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతన్నలు దళారులను ఆశ్రయించి నష్టపోకూడదనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్రాంరెడ్డి అన్నారు. సోసైటీ బ్యాంకు ఆధ్వర్యంలో పోతులబోగూడ, పాంబండ, కొత్తపేట, తాళ్లపల్లి తండా, మల్లుపల్లి, శివ్వంపేటలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సీఈఓ మధు యాదవ్ తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా సుహాసిని రెడ్డి మాట్లాడుతూ.. మద్దతు ధర దక్కాలంటే, సన్న వడ్లకు బోనస్ పొందాలంటే కొనుగోలు కేంద్రాలలోనే దాన్యాన్ని విక్రయించాలని ఆమె సూచించారు.ఈకార్యక్రమంలో వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్ రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, మండల సీనియర్ నాయకులు నవీన్ గుప్త,వారాల గణేష్,షేక్ అలీ, అక్కమొల్ల మైసయ్య యాదవ్, గ్యాదరి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



**చట్టం మెదక్ :** మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కలెక్టర్ రేగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రక్త పరీక్ష కేంద్రం, మందులు నిల్వ చేయు స్టోర్ రూమ్, ఓపి రిజిస్టర్, సిబ్బంది హాజరు పట్టిక పరిశీలించి వైద్యాధికారికి వైద్య సిబ్బందికి తగు సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆరోగ్య కేంద్రంలో ఎండ వేడిమి కారణంగా వడదెబ్బ తగిలి. ఆస్పత్రికి చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. ఆశా కార్యకర్తలతో కలెక్టర్ పలు సూచనలు వేస్తూ ఎండ వేడిమికి వడదెబ్బలపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో వడ దెబ్బలు, ఇతర సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వివరించారు. వడదెబ్బ తగిలిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచారం చేయాలని ఆదేశించారు. ప్రజలు తగినన్ని మంచినీరు తీసుకోవాలని ఎండలకు ఎంతో అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్ళవద్దని, ముఖ్యంగా ఉపాధి హామీ పథకం పనిచేసే కూలీలు పనిచేసే ప్రాంతంలో త్రాగునీరు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని ఉపాధి హామీ పని వేళలు ఉదయం 06.00 గంటల నుండి 11 గంటల వరకు ముగించాలని, సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం: గంప గోవర్ధన్



**చట్టం కామారెడ్డి ప్రతినిధి**

యువతకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ అన్నారు. బీఆర్ఎస్ పట్టణ యూత్ ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ ఆధ్వర్యంలో శివ, శ్రీకాంత్లతో కూడిన పలువురు మంగళవారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై కోసం పోరాటం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుంభాల రవి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ హఫీజ్, బీఆర్ఎస్ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు చెలిమెల భాను ప్రసాద్, కోశాధికారి సాయి యూత్ నాయకులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ గ్రామాల్లో పర్యటించిన రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్..

**గిరిజన సాంప్రదాయ నృత్యాలు, సంగీతాలతో స్వాగతం పలికిన గిరిజనులు.**



**చట్టం / జీలుగుమిల్లి :** పోలవరం నియోజవర్గంలో రెండు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం రెడ్డి గణపవరం, రౌతుగూడెం గ్రామాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో పాల్గొన్న అనంతరం బర్రింకలపాడులో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రి నాదెండ్ల మనోహర్ కి గిరిజన ప్రజలు గిరిజన సాంప్రదాయ నృత్యాలు, సంగీతాలతో స్వాగతం పలికారు. వారి నాట్యానికి ముగ్ధుడైన మంత్రి వారి వద్ద నున్న కొమ్ములు ధరించి వారితో కలిసి మంత్రి నృత్యం చేశారు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రభుతులు కూడా గిరిజనుల ఆనందంలో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు శాసన సభ్యులు పత్సమట్ల ధర్మరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, ఆర్ టిసి జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, జనసేన నాయకులు కొటికలపూడి గోవిందరాజు, కరాటం సాయి, గడ్డమనుగు రవి, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో హాజరైన నారాయణరావు పటేల్



**చట్టం, ముధోల్ :** నిర్మల్ జిల్లా ముధోల్ మండల కేంద్రములో బస్వ గార్డెన్ లో మంగళవారం మాధవ్ శివని వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించిన ముధోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణ్ రావు పటేల్ వారితో పాటు ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ చేంద్రే కుబీర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బషీర్ మాజీ ఎంపీపీ రామచంద్ర రెడ్డి శకున్ కుమార్,ముత్యం ,యోగేష్.ఆనందరావు బోతే,సాయికుమార్ ,ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## చలో వరంగల్ పోస్టర్లను ఆవిష్కరించిన మాజీ జెడ్పిటిసి




**చట్టం ప్రతినిధి కామారెడ్డి:** చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరించిన టిఆర్ఎస్ నాయకులు కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం లోని స్థానిక మాజీ ఎంపీపీ నా రెడ్డి దశరథ్ రెడ్డితో కలిసి ఉమ్మడి సదాశివ నగర్ మండల్ మాజీ జెడ్పిటిసి పడిగెల రాజేశ్వరరావు పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు టిఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా నిర్వహించే రజో కార్యక్రమానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు వెళ్లాలని వారు కోరారు సందర్భంగా మాజీ జెడ్పిటిసి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి టిఆర్ఎస్ పార్టీ శ్రీరామరక్షణ అన్నారు జాతీయ పార్టీలు తెలంగాణ పట్ల వివక్ష చూపుతున్నారు ఇప్పటికైనా కర్షకులు కార్మికులు ఆలోచించాలన్నారు. తెలంగాణ ప్రజల అభివృద్ధి ఆకాంక్షించే వ్యక్తి కేసీఆర్ అన్నారు ఈ కార్యక్రమంలో కామారెడ్డి మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్ గొల్లపల్లి మోషన్ పూర్ పోసానిపేట్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డి మల్లేష్ సంతోష్ రెడ్డి టాంకర్ రవి, గిరిజన నాయకుడు లింబాద్రి నాయక్ ,పోసాన్పేట్ మాజీ రైతు బంధు అధ్యక్షుడు తిరుపతి ,శంకర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అందరూ ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలి

**ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి**



**చట్టం బోధన్ :** నిజామాబాద్ జిల్లాలోని బోధన్ పట్టణంలో మంగళవారం నాడు పలు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో మాజీ మంత్రి, నియోజకవర్గ శాసన సభ్యులు ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌ను, గ్రంథాలయ కార్యాలయంలో రీడింగ్ షెడ్ ను ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎక్సైజ్ పోలీస్ అధికారులు, సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏసీపీ శ్రీనివాస్, ఇతర ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవ అనంతరం సమీక్షా సమావేశం నిర్వహించబడింది.అనంతరం గ్రంథాలయ రీడింగ్ షెడ్ ప్రారంభోత్సవంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తహేర్ బిన్ హందాన్, సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏ సి పి శ్రీనివాస్, గ్రంథాలయ నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో సంభాషించారు. గ్రంథాలయంలో మౌలిక వస్తువుల గురించి అడిగి తెలుసుకున్నారు. అందరూ ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ఏకాగ్రతతో చదివి తమ ఆశయాలను నెరవేర్చుకోవాలని, తమ ప్రభుత్వం కూడా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని అందరూ సద్వినియోగపరచుకోవాలని కోరారు. ప్రభుత్వం విద్యార్థులకు వనరులను కల్పించేందుకు కట్టుబడి ఉందని అన్నారు. విద్యా అవకాశాలు, సదుపాయాలు అందించేందుకు అధికార యంత్రాంగం కృషి చేస్తుందని అన్నారు. 15వ వార్డులో స్వయంగా పర్యటించి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకుని పలువురికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల లబ్ధికై వివరాలు సేకరించి పొందుపరచమని అధికారులను ఆదేశించారు. ఇట్టి కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్ నారాయణ, ఎమ్మార్వో విట్టల్, ప్రభుత్వ అధికారులు, పిసిసి డెలికేట్ గంగా శంకర్ బోధన్ కాంగ్రెస్ నాయకులు తూము శరత్ రెడ్డి, దాము, నాగేశ్వరరావు, హరికాంత్ చారి, కర్నే హనుమంత్ రావు, పౌల్, అల్లే రమేష్, సంజీవ్ రెడ్డి, ఆదినారాయణ, గుండెడి శంకర్, తలారి నవీన్, జహీర్ తదితర ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by SIRIGADA PRASAD and Printed at INDUR OFFSET PRINTERS, Opposite Cheer Hanuman Temple, Weekly Bazar, Nizamabad District,Telangana 503001., and Published at: H.No. 3-3-486/2, Gayathrinagar, Varni road, Nizamabad District, Telangana - 503001.,Editor: SIRIGADA PRASAD. RNI.No. TELTEL/2010/32350. Cell ;9948884497. prasadsirigada27@gmail.com